www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | శనివారం 15,ఆగస్టు, 2026




## రూ.16,007 కోట్ల
# భారీ ప్రణాళిక

- ములుగు కేంద్రంగా అభివృద్ధి కి నాంది
- - 2145 రహదారుల నిర్మాణం
- 7448 కిలోమీటర్ల మేరా అభివృద్ధి కార్యాచరణ
-రాష్ట్ర గ్రామీణ రహదారుల అభివృద్ధికి ములుగు జిల్లా వేదిక.
-పైలాన్ ఆవిష్కరించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

2 లో..

భద్రాద్రి న్యూస్ ములుగు బ్యూరో : రాష్ట్ర గ్రామీణ రవాణా రంగంలో సరికొత్త అధ్యాయానికి ములుగు జిల్లా వేదిక కానుంది. గ్రామాలు, మండల కేంద్రాలు, ప్రధాన రహదారుల మధ్య మెరుగైన అనుసంధానం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న భారీ రహదారి అభివృద్ధి కార్యక్రమానికి ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ములుగు నుంచి శ్రీకారం చుట్టనున్నారు. సుమారు రూ.16,007 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ కార్యక్రమానికి గుర్తుగా ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు తొలి దశలో 2,145 రహదారులను సుమారు 7,448 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలకు, అక్కడి నుంచి ప్రధాన రహదారులకు నిరంతర అనుసంధానం కల్పించేలా ఈ ప్రణాళికను రూపొందించారు.

## బీఆర్ఎస్ హయాంలో ఖమ్మం అభివృద్ధి పురోగమనం మాజీ మంత్రి పువ్వాడ

- స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలే స్ఫూర్తిగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలి
- ఖమ్మం మరింత ప్రగతిని సాధించాలని పువ్వాడ ఆకాంక్ష



6లో

భద్రాద్రి న్యూస్ ఎఫెక్ట్

## ఆర్ఎంపీ లు
## పరిధి దాటి వైద్యం చేయొద్దు

- ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా వైద్య అధికారులు
- రోగులకు యాంటీబయటిక్ ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- అర్హత మించి వైద్యం చేయకూడదని సూచన
- ఆర్ఎంపీలపై 'భద్రాద్రి న్యూస్' ఫోకస్
- దిగి వచ్చిన అధికారులు






చంద్రుగొండ భద్రాద్రి న్యూస్ ప్రతినిధి: మండలంలో అమాయక రోగులపై ఆర్ఎంపీలు చేస్తున్న చికిత్సపై ఈనెల ఆగస్టు 12వ తేదీన భద్రాద్రి న్యూస్ తెలుగు దినపత్రికలో ప్రచారతమైన "హద్దు మీరుతున్న ఆర్ఎంపీ వైద్యం" అనే కథనంపై వైద్య అధికారులు మండలానికి దిగొచ్చారు. ఈ సందర్భంగా వారు ఆర్ఎంపీ డాక్టర్ల క్లినిక్ లపై తనిఖీ..

2వ పేజీలో..

# రూ.16,007 కోట్ల భారీ ప్రణాళిక

**మొదటి పేజీ తరువాయి**

గ్రామీణ రవాణా వ్యవస్థను సమూలంగా మార్చడంతో పాటు పల్లెల నుంచి పట్టణ ప్రాంతాల వరకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలనే దూరదృష్టితో ప్రభుత్వం బృహత్తర కార్యాచరణకు రూపకల్పన చేసింది. ప్రతి గ్రామాన్ని మండల కేంద్రంతో రెండు వరుసల రహదారితో, మండల కేంద్రాన్ని జిల్లా కేంద్రంతో నాలుగు వరుసల రహదారితో, జిల్లా కేంద్రాన్ని రాష్ట్ర కేంద్రంతో ఆరు వరుసల రహదారితో అనుసంధానించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పంచాయతీరాజ్ పరిధిలోని రహదారులను పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వం, బ్యాంకులు, నిర్మాణ సంస్థల భాగస్వామ్యంతో ఆర్థిక వనరులను సమకూర్చుకొని ఈ భారీ రహదారి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో కార్యరూపంలోకి తీసుకురానున్నారు. మెరుగైన రహదారులు గ్రామీణ ప్రజల జీవన విధానంలో ప్రత్యక్ష మార్పు తీసుకురానున్నాయి. రైతులు తమ పంటలను మార్కెట్లకు సులభంగా తరలించుకోవడం, విద్యార్థులు విద్యా సంస్థలకు సౌకర్యవంతంగా చేరుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు వేగంగా అందుకోవడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం వంటి అనేక ప్రయోజనాలు కలుగనున్నాయి. ముఖ్యంగా అటవీ, గిరిజన ప్రాంతాలు అధికంగా ఉన్న ములుగు వంటి జిల్లాలకు మెరుగైన రహదారి అనుసంధానం అభివృద్ధికి కీలకంగా మారనుంది. రహదారుల నిర్మాణాన్ని హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపట్టనున్నారు. నిర్మాణ వ్యయంలో ప్రభుత్వం, నిర్మాణ సంస్థలు భాగస్వామ్యం కానుండగా, పనులు పూర్తయిన అనంతరం కూడా నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చేలా దీర్ఘకాలిక నిర్వహణ విధానాన్ని అమలు చేయనున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత 15 సంవత్సరాల పాటు సంబంధిత నిర్మాణ సంస్థలే రహదారుల నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో రహదారుల నిర్మాణంతో పాటు వాటి నాణ్యత, మన్నికకు కూడా భరోసా కలగనుంది. ఈ బృహత్తర రహదారి అభివృద్ధి కార్యక్రమానికి ములుగు జిల్లా వేదిక కావడం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గం నుంచే, ఆమె శాఖకు సంబంధించిన రాష్ట్రస్థాయి ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుండటం విశేషం. అటవీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాలు అధికంగా ఉన్న ములుగు జిల్లాను ప్రారంభ వేదికగా ఎంపిక చేయడం ద్వారా మారుమూల ప్రాంతాల రహదారి అనుసంధానానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం స్పష్టమవుతోంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి మెరుగైన రహదారులే కీలకమన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమం ములుగు నుంచే ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణంగా నిలవడంతో పాటు, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతమివ్వనుంది.

# రక్తదాతలు నిజమైన హీరోలు






**రక్తదానం ద్వారా అమూల్యమైన ప్రాణాలను కాపాడవచ్చు**

**డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ తుకారాం రాథోడ్**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 14( భద్రాద్రి న్యూస్ ):**

రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే రక్తదాతలు నిజమైన హీరోలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో లీగల్ సర్వీసెస్ అథారిటీ, భద్రాద్రి కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, సీనియర్ సివిల్ జడ్జి కం సెక్రటరీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ శ్రీ రాజేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేసిన దాతలను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, ఒక వ్యక్తి ఇచ్చే రక్తం మరొక వ్యక్తికి ప్రాణదానం చేయగలదని అన్నారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, అత్యవసర వైద్య పరిస్థితుల్లో సకాలంలో రక్తం అందుబాటులో లేకపోతే ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు మరియు తీవ్రమైన రక్తస్రావం జరిగే సందర్భాల్లో తక్షణమే రక్తం అవసరమవుతుందని, అలాంటి సమయంలో రక్తదాతలు ముందుకు రావడం ఎంతో కీలకమని తెలిపారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని, ఒక మనిషి నుంచి మరొక మనిషికి రక్తదానం ద్వారానే రక్తాన్ని అందించగలమని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి నిర్దిష్ట వ్యవధిలో రక్తదానం చేయడం ద్వారా సమాజానికి విలువైన సేవ చేయవచ్చని, యువత రక్తదానంపై అవగాహన పెంచుకొని స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని డీఎంహెచ్ఓ పిలుపునిచ్చారు. “రక్తదానం చేయండి -- ప్రాణాలను కాపాడండి” అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

**ఫ్రైడే--డ్రై డే కార్యక్రమంపై ఆకస్మిక తనిఖీ**

రక్తదాన శిబిరం అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సఫాయి బస్తీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టేందుకు నిర్వహిస్తున్న ఫ్రైడే--డ్రై డే కార్యక్రమం అమలును పరిశీలించారు.

బస్తీలో నీటి నిల్వలు, పరిసరాల పరిశుభ్రత, దోమల వృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను పరిశీలించి, ప్రజలకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటం, దోమల నివారణ చర్యలు చేపట్టడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

అనంతరం ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి, ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజల భాగస్వామ్యంతో దోమల పెరుగుదలను నియంత్రించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో సిబ్బంది నిరంతరం పర్యటిస్తూ, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలను పర్యవేక్షించాలని సూచించారు. సాధారణ కాన్పులను పెంచాలని, ఈ డి డి ప్రకారం గర్భిణీ స్త్రీలను హాస్పిటల్లో కాన్పు అయ్యే విధంగా ప్రోత్సహించాలని వారిని ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలని ఐ రిస్క్ గర్భిణీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు

ఎన్ సి డి కార్యక్రమంలో భాగంగా 30 సంవత్సరాలు దాటిన అందరికీ స్క్రీనింగ్ నిర్వహించాలని బిపి, షుగర్ , వ్యాధిగ్రస్తులకు క్రమం తప్పకుండా నెల నెల మందులు అందించవలెనని తెలియజేశారు

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధామోహన్, డాక్టర్ సీతారాం, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ సురేందర్ , యు పిహెచ్సి సఫాయి బస్తీ సిబ్బంది శ్రీనివాస్, జగదీష్ , శారద విజయలక్ష్మి , సంగీత, సుమంత్ పావని , ఆరోగ్య సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీ లు పరిధి దాటి వైద్యం చేయొద్దు

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించారు. ఈ తనిఖీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ రామదాసు, డాక్టర్ రాకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎంపీ వైద్యులు యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటి మందులు రోగులకు ఇవ్వకుండా ఉండాలని అన్నారు. అదేవిధంగా తమ అర్హతకు మించి వైద్యం చేయకూడదని అర్హత మించి వైద్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదేవిధంగా మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కొన్ని క్లినిక్ లకు నోటీసులు జారీ చేశారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అర్హతకు మించిన వైద్యం చేయకూడదని సూచించారు .ఈ తనిఖీలలో చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య వైద్య అధికారి డాక్టర్ రమేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, హెల్త్ సూపర్వైజర్ పూర్ణ రావు, పాల్గొన్నారు.

# ఆగస్టు 22న జిల్లా సబ్ జూనియర్స్ బాల్ బ్యాట్మెంటన్ టీమ్స్ ఎంపిక

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 14(భద్రాద్రి న్యూస్):-**

బాల్ బ్యాట్మెంటన్ సబ్ జూనియర్స్ క్రీడాకారుల టీమ్స్ ఎంపిక ఈనెల 22 న ఉదయం 9:00 గంటలకు కల్లూరు PM SHRI గవర్నమెంట్ హై స్కూల్ లో పురుషులు,మహిళలు టీంలకు సెలక్షన్స్ ఉంటాయని బాల్ బ్యాట్మెంటన్ ఖమ్మం జిల్లా సెక్రెటరీ బొంతు శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టీం లో ఎంపికలో ఖమ్మం జిల్లా అధ్యక్షులు వేజెళ్ల సురేష్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ అమరేశ లింగయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఉన్నం నాగేశ్వరావు పాల్గొంటారని ఆయన తెలిపారు. క్రీడాకారులను ఎంపికలను కల్లూరు వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ దర్శకులు సహకారంతో నిర్వహిస్తారని తెలిపారు. జనవరి 2, 2011 తర్వాత జన్మించిన వారు బాలురు మరియు బాలికలు క్రీడలకు అర్హులవుతారని తెలిపారు. . ఉమ్మడి జిల్లాలో క్రీడాకారులందరూ బాలురు మరియు బాలికలు తమ ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లతో సకాలంలో హాజరుకావాలని కోరారు. ఎంపికైన జట్లను తెలంగాణ బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 28 నుండి 30 వరకు హైదరాబాద్ బీహెచ్ఈఎల్ వాణి విద్యానికేతన్ స్కూల్ నందు జరిగే సబ్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంటుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పంపిస్తామని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఇంటర్ డిస్టిక్ టోర్నమెంట్లో వసతి, భోజన సదుపాయాలు తెలంగాణ బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ కల్పిస్తారని పేర్కొన్నారు. మరి మరిన్ని వివరాలకై ఈ నెంబర్ను 98852 82930 సంప్రదించాలని కోరారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**భద్రాద్రి న్యూస్ ములుగు**



80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శనివారం ఉదయం 8.55 గంటలకు మంత్రి వేడుకల ప్రాంగణానికి చేరుకొని, ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. తదనంతరం స్వాతంత్ర్య సమరయోధుల సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాల ప్రదానం కార్యక్రమాల్లో పాల్గొని, వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను పరిశీలిస్తారు. జిల్లా కేంద్రంలోని తాగేడు మైదానంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి వేదిక ఏర్పాటు, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయం తదితర ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా నిర్దేశించిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించేలా సంబంధిత శాఖలకు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వేడుకల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేసే ప్రదర్శన స్టాళ్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు ఆ ప్రకటనలో వెల్లడించారు.

# ఆక్రమణదారులపై కఠిన చర్యలు ఎక్కడ?..

**హెచ్చరిక బోర్డులతో సరిపోతుందా?**
**హెచ్చరికలతో కాలయాపన ఎందుకు?..**
**ఆక్రమణదారులపై వెంటనే కేసులు నమోదు చేయాలి**
**అక్రమ కట్టడాలు పూర్తిగా తొలగించాలి**
**ఏడాది నిర్లక్ష్యానికి తహసీల్దార్ హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలన్న డిమాండ్**



**చర్ల, ఆగస్టు 14: భద్రాద్రి న్యూస్**

చర్ల మండలంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాల వ్యవహారం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకపోయినా, అధికారులు మళ్లీ అదే చర్యను పునరావృతం చేయడం స్థానికుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సమయంలో కేవలం హెచ్చరిక బోర్డులతో సరిపెట్టడం ఎందుకనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

శుక్రవారం చర్ల తహసీల్దార్, ఎంపీడీవో, విద్యుత్ శాఖ ఏఈతో పాటు పలువురు శాఖల అధికారులు ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి మరోసారి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే, ఇది సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని, ఆక్రమణదారులకు పరోక్షంగా ఊరటనిచ్చే చర్యగా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడం చట్టవిరుద్ధమైతే, ఆ చట్టాన్ని అమలు చేసే బాధ్యత అధికారులదే కాదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేవలం హెచ్చరికలు జారీ చేయడం కాకుండా, ప్రభుత్వ ఆస్తిని ఆక్రమించిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టవిరుద్ధంగా నిర్మించిన కట్టడాలను పూర్తిగా కూల్చివేయాలని డిమాండ్ చేస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానమే అయితే, ఆక్రమణదారుల విషయంలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని ప్రశ్నిస్తున్నారు.

ఈ సమస్య ఏడాది కాలంగా కొనసాగుతున్నప్పటికీ, దాన్ని ప్రారంభ దశలోనే అరికట్టకుండా కాలయాపన చేయడం వల్లే ఆక్రమణదారులు మరింత ధైర్యం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంతో వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో తహసీల్దార్ హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ భూములను రక్షించడం రెవెన్యూ శాఖ ప్రాథమిక బాధ్యత అని గుర్తు చేస్తున్న ప్రజలు, ఇప్పటికైనా మాటలకే పరిమితం కాకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేసి, ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి, అక్రమ కట్టడాలను పూర్తిగా తొలగించి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ప్రజా చైతన్య యాత్రలో కార్యకర్తలకు గుర్తింపు

**తొమ్మిది రోజులు నిరవధికంగా యాత్రలో పాల్గొన్న వారికి సన్మానాలు**



**కొత్తగూడెం టౌన్ ,ఆగస్టు 14 (భద్రాద్రి న్యూస్):–**

భద్రాద్రి కొత్తగూడెం నియోజకవర్గం నుండి సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 6 నుండి 14 వరకు తలపెట్టిన ప్రజా చైతన్య యాత్రలో కంటిన్యూగా పాల్గొన్న సిపిఐ ఆర్గనైజ్ సెక్రటరీ కరీష రత్నకుమారి ని గుర్తించి ఎమ్మెల్యే సాంబశివరావు , సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా , కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ ఆధ్వర్యంలో వారికి మెమొంటోలు ఇచ్చి సన్మానం చేయడం జరిగినది. ఈ సందర్భంగా కరీష రత్నకుమారి మాట్లాడుతూ ...ఈ సన్మానం నాకు జరగడం చాలా సంతోషకరంగా ఉంది ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ ప్రజా చైతన్య యాత్రను ప్రతి గ్రామంలో ఆదరించి విజయవంతం చేసి మంచి భోజనాలు ఏర్పాటు చేసి వసతులు కల్పించిన ప్రతి కామ్రేడ్స్ కు లాల్ సలాం తెలిపారు.

# అభివృద్ధి కి బ్రాండ్ అంబాసిడర్ తుమ్మల

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 14( భద్రాద్రిన్యూస్ ):–**



సమగ్రాభివృద్ధి సంక్షేమమే మంత్రి తుమ్మల ధ్యేయం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఖమ్మం త్రీటౌన్ ఏరియా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్ తెలిపారు. ఖమ్మం నగరాభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించారన్నారు. ఖమ్మం నగరం జూబ్లీ క్లబ్ లో ఖమ్మం 3 టౌన్ ఏరియా కాంగ్రెస్ నాయకులతో మీడియా సమావేశం శుక్రవారం నాడు జరిగింది. సమావేశంలో పలువురు నేతలతో కలిసి మాట్లాడిన తిలక్ ఖమ్మం 3 టౌన్ ఏరియా అభివృద్ధిపై సంక్షేమ పథకాలపై పూర్తి వివరాలను మీడియాకు తెలియజేశారు. ఖమ్మం నియోజవర్గంలో ఇప్పటివరకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 1177 లబ్ధిదారులకు గాను 1,78,36,532 రూపాయలను, అత్యవసర ఆరోగ్య పరిస్థితులలో అందించే లి ఎల్ వో సి లను 213 మందికి గాను 4,71,30,000 రూపాయలను మరియు లి సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు 2365 మందికి గాను 7,27,90,000 రూపాయలను కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించడం జరిగింది. రూ.249 కోట్లతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, ఖానాపురం ఊరచెరువు నుంచి ధంసలాపురం చెరువు వరకు 8.5 కి.మీ ట్రంక్ పైప్‌లైన్, ధంసలాపురంలో 44 ఎంఎల్‌డీ, పుట్టకోటలో 9.5 ఎంఎల్‌డీ నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసినాదే అని అన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కి రూ.200 కోట్లు మంజూరు, వర్షపు నీరు, మురుగునీరు వేరుగా ప్రవహించే స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు కూడా చేపట్టారని తెలిపారు. మున్నేరు ఫ్లడ్ ప్రొటెక్షన్ కోసం రూ.700 కోట్లతో మున్నేరుకు ఇరువైపులా కాంక్రీట్ వాల్స్, రూ.220 కోట్లతో ఫ్లడ్ వాటర్ మళ్లింపు డ్రైనేజ్ నిర్మాణములు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఖమ్మంను ట్రాఫిక్ ఫ్రీ సిటీ గా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

మున్నేరుపై నిజాం కాలం నాటి కాల్వ ఒడ్డు బ్రిడ్జి వద్ద రూ.180 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణం ఖమ్మం నగరానికి ఐకానిక్‌గా మారుతుందని తిలక్ చెప్పారు. ఖమ్మం చుట్టూ రింగ్ రోడ్డు ప్రతిపాదన, విజయవాడ–జగదల్‌పూర్ హైవేలో మార్పులు, పొన్నెకల్–ఇల్లెందు క్రాస్ కు రూ.120 కోట్లు, కోదాడ–ఖమ్మం 32 కి.మీ రోడ్డు, ఖమ్మం–కొరివి 37 కి.మీ రోడ్డు విలీన గ్రామాల్లో సి సి రోడ్లు, డ్రెయిన్ల కోసం ఇప్పటికే రూ.200 కోట్ల పనులు, మరో రూ.150 కోట్లు ప్రతిపాదన ఉందన్నారు. రూ.150 కోట్లతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ. రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతున్నారన్నారు.

చారిత్రక ఖిల్లాను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రూ.15 కోట్లతో రోప్ వే నిర్మాణం, రాత్రి లైటింగ్, పచ్చదనం ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు.

వెలుగుమట్ల అర్బన్ పార్క్ 500 ఎకరాల్లో ఈకో పార్క్‌గా అభివృద్ధి చేశారని చెప్పారు. శిల్పారామం ఏర్పాటుకు కృషి జరుగుతుందన్నారు.

అమృత్ నిధులతో రూ.220 కోట్లు తీసుకొచ్చి తాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కరిస్తున్నారని తెలిపారు. రఘునాథపాలెం మండలం సాగు తాగు నీటి కోసం సాగర్ కెనాల్‌పై లిఫ్ట్ ద్వారా మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ చేపట్టారని తెలిపారు.

ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి తుమ్మల ఇటీవల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారని తిలక్ తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు, జిల్లా కోర్టు నిర్మాణం, ఖమ్మం శివార్లలో ఆలయాల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తిలక్ తెలిపారు.

ఈ పాత్రికేయ సమావేశంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, త్రీ టౌన్ ప్రాంత తాజా మాజి కార్పొరేటర్లు కొప్పుర సరిత ఉపేందర్,రుద్రగాని శ్రీదేవి ఉపేందర్, కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, గజ్జల లక్ష్మీ వెంకన్న, దొన్వాన్ సరస్వతి రవి, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు తూములూరి లక్ష్మీనరసింహారావు, కలిమెల భద్రయ్య, భోజడ్ల సత్యనారాయణ, యాసబోయిన శ్రీశైలం అదేవిధంగా డిసిసి ఖమ్మం నగర కార్యవర్గ సభ్యులు పత్తికొండ శ్రీనివాసులు, గెల్లా కృష్ణవేణి, బాలిని శ్రీనివాస్, దేవర వెంకన్న, జాకీర్, గుడ్ల శ్రీనివాసరావు, తోళ్ల కుటుంబరావు మరియు ఓబీసీ సెల్ నగర అధ్యక్షులు బాణాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 14 (భద్రాద్రిన్యూస్ ):–**



ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వాన్ని కాపాడుతూ ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. యువత విద్య, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో రాణించి దేశ ప్రగతిలో కీలక భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. రైతులు, కార్మికులు, యువత దేశానికి వెన్నెముక అని పేర్కొంటూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం, శాంతి, సామరస్యంతో ముందుకు సాగితేనే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. భారతదేశం ప్రపంచంలో మరింత శక్తివంతమైన, అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# వరలక్ష్మీ వ్రతంలో మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి

**రైతులకు సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 14 (భద్రాద్రిన్యూస్ ):–**



శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా వైరా వేదపాఠశాలలో శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు మహిళా విభాగం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వర్షాభావ పరిస్థితులతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ గోపూజతో పాటు 108 బిందెల నీటితో ప్రత్యేక జలాభిషేకం నిర్వహించారు. రైతుల సంక్షేమం, ప్రజల సుఖసంతోషాల కోసం భగవంతుడిని ప్రార్థించారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కార్యక్రమంలో సత్యసాయి సేవా ట్రస్టు రాష్ట్ర అధ్యక్షులు దమ్మాలపాటి సుధాకర్, జిల్లా అధ్యక్షులు నరసింహారావు, వైరా కన్వీనర్ కుమార్, కోఆర్డినేటర్ భాస్కర్‌రావు, యూత్ కోఆర్డినేటర్ నరేష్, మహిళా కోఆర్డినేటర్ హనుమాయమ్మ, కాపా మురళీకృష్ణ, 15వ వార్డు కౌన్సిలర్ శైలజ, మాచెర్ల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# వరుస చైన్ స్నాచింగ్ కేసులను ఛేదించిన భద్రాద్రి జిల్లా పోలీసులు

**మంది నిందితుల అరెస్ట్..**
**ఒకరు అంతర్రాష్ట్ర నేరస్తుడు..**
**రూ.26 లక్షల విలువైన సొత్తు స్వాధీనం**



**భద్రాద్రి కొత్తగూడెం ,ఆగస్టు 14( భద్రాద్రి న్యూస్):-**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరుసగా జరుగుతున్న చైన్ స్నాచింగ్ కేసులను పోలీసులు సమర్ధవంతంగా ఛేదించారు. జిల్లా ఎస్పీ శ్రీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో అశ్వారావుపేట, దమ్మపేట, బూర్గంపాడు, పాల్వంచ రూరల్, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన వరుస చోరీ కేసులపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.
ఈ కేసులకు సంబంధించి మొత్తం 8 మంది నిందితులను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి సుమారు 150 గ్రాముల బరువున్న 6 బంగారు గొలుసులను, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు మొత్తం విలువ సుమారు రూ.26 లక్షలు ఉంటుందని తెలిపారు.

ప్రధాన నిందితుడు సున్నం నాగేంద్రబాబు ఏ నాగేంద్ర తన సహచరులతో కలిసి రాత్రి వేళల్లో ఇళ్ల బయట నిద్రిస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవాడని దర్యాప్తులో వెల్లడైంది. మహిళల మెడలోని బంగారు గొలుసులను ఎలక్ట్రిక్ వైర్ కట్టర్‌తో కట్ చేసి క్షణాల్లో అపహరించి, ద్విచక్ర వాహనాలపై అక్కడి నుంచి పరారయ్యేవారు. కొన్ని సందర్భాల్లో ముందుగానే ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, వాటిని తదుపరి నేరాలకు ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు.
చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితులు తమ వద్ద ఉంచుకోకుండా, ముఠాకు సహకరిస్తున్న మహిళల వద్ద దాచిపెట్టినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుల విచారణలో దమ్మపేట, బూర్గంపాడు, పాల్వంచ రూరల్, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 10 కేసులకు సంబంధించి కీలక ఆధారాలు లభించాయి.
ఈ ముఠాలో ప్రధాన నిందితుడైన సున్నం నాగేంద్రబాబు, వయస్సు 35 సంవత్సరాలు, ఉసిర్లగూడెం గ్రామం, అశ్వారావుపేట మండలానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఇతనిపై అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, బూర్గంపాడు, పాల్వంచ, భద్రాచలం, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 83 దొంగతనం కేసులు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.
ఇతనితో పాటు వల్లూరి శాంతరాజు ఏ రాజు, ఉకే భద్రం ఏ వీరభద్రం, బెత్తి కార్తిక్, ఊర లింగయ్య, బెత్తి ఆదిలక్ష్మి, కల్లూరి లావణ్య, అల్లం సారమ్మ ఏ సర్లమ్మలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో వల్లూరి శాంతరాజుపై 11 దొంగతనం కేసులు, ఊర లింగయ్యపై 12 దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిపారు.
ఈ కేసుల్లో మరో నిందితుడైన తమ్మిశెట్టి బాలవీరస్వామి, వయస్సు 50 సంవత్సరాలు, మాధాల గ్రామం, ముప్పాళ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఇతను అంతర్రాష్ట్ర నేరస్తుడిగా గుర్తించామని, అతని కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పి తెలిపారు.
దర్యాప్తులో భాగంగా పార్కలగండి, దమ్మపేట పరిధిలో వృద్ధ మహిళను లక్ష్యంగా చేసుకుని బంగారు నానుతాడు చోరీ చేసినట్లు, బూర్గంపాడు పరిధిలో ద్విచక్ర వాహనం చోరీ చేసినట్లు, పాల్వంచ రూరల్ పరిధిలో మరో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం చోరీ చేసిన వాహనాలను ఉపయోగించి బూర్గంపాడు, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండ ప్రాంతాల్లో మహిళల మెడలోని బంగారు గొలుసులను చోరీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.
చంద్రుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతాయిగూడెం కేసులో ప్రధాన నిందితుడి వద్ద నుంచి 24 గ్రాముల బంగారు చైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఇతర కేసుల్లో చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితుల సహకారంతో వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు.
వరుస చైన్ స్నాచింగ్ కేసులను సమర్ధవంతంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు భారీ మొత్తంలో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు. నేరాల నియంత్రణలో భాగంగా జిల్లాలో ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఎస్పీ తెలిపారు.
ఈ కేసుల ఛేదనలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, అశ్వారావుపేట సీఐ నాగరాజు, ఎస్ఐలు రాజేశ్ కుమార్, యయాతి రాజు, బాలస్వామినాథం, దేవ్ సింగ్, హెచ్‌సీ ప్రసాద్, పీసీలు వెంకట్,ధర్మారావు, లక్ష్మయ్య, రామకృష్ణారెడ్డి, బాలకృష్ణ, నరసింహారావు, డబ్ల్యూపీసీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# స్వయం సహాయక సంఘాల ఎన్‌పీఏ రుణ ఖాతాలను తగ్గించాలి

## బ్యాంకర్లు, స్వయం సహాయక సంఘాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన








**భద్రాద్రి కొత్తగూడెం ,ఆగస్టు 14( భద్రాద్రి న్యూస్):-**
శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలు, బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన బ్యాంకు రుణాలు, రుణ బకాయిలు, ఎన్‌పీఏ ఖాతాలపై మండలాలు, సంఘాల వారీగా సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా డైరెక్టర్ వై.ఎన్. రెడ్డి జిల్లాలోని అన్ని బ్యాంకు శాఖల్లో స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన బ్యాంకు రుణాల ఎన్‌పీఏ ఖాతాల వివరాలను సమీక్షించారు. మండలాల వారీగా, సంఘాల వారీగా ఎన్‌పీఏ పరిస్థితిని పరిశీలించి, ఎన్‌పీఏను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఏపీఎంలు, బ్యాంకు శాఖల నిర్వాహకులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన మాట్లాడుతూ, ఏపీఎంలు, బ్యాంకు శాఖల నిర్వాహకులు సమన్వయంతో పనిచేసి స్వయం సహాయక సంఘాల ఎన్‌పీఏను తగ్గించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. మండలాలు, సంఘాల వారీగా రుణ ఖాతాలను పరిశీలించి, బకాయిల వసూళ్లకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి ఎన్‌పీఏను పూర్తిస్థాయిలో తగ్గించేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలు తీసుకున్న బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించేలా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని, రుణాల చెల్లింపులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రుణ బకాయిలు ఉన్న సంఘాలను గుర్తించి, ఆయా సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడి రుణాల చెల్లింపునకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. అవసరమైన చోట బ్యాంకర్లు, ఏపీఎంలు కలిసి సంఘాల సభ్యులకు రుణ చెల్లింపుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు.
స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేయడంలో బ్యాంకు రుణాల సకాలంలో చెల్లింపు కీలకమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. సంఘాలు రుణాలను సక్రమంగా వినియోగించుకొని, నిర్ణీత కాల వ్యవధిలో వాయిదాలను చెల్లించేలా ప్రోత్సహించాలని అన్నారు. ఎన్‌పీఏ తగ్గింపుతో పాటు భవిష్యత్తులో స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు సులభంగా అందేలా నమ్మకాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.
బ్యాంకర్లు, స్వయం సహాయక సంఘాల సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, ప్రతి మండలంలో ఎన్‌పీఏ తగ్గింపుపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో ఎల్‌డీఎం రామిరెడ్డి, పీఎం (బీఎల్) వీరమల్లు, పీఈ (బీఎల్) వెంకట్, అదనపు డీఆర్‌డీఓ నీలేష్, డీపీఎంలు, ఏపీఎం (బీఎల్), అన్ని బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

# పైలాన్, నూతన కలెక్టరేట్ తుది దశ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు








భద్రాద్రి న్యూస్ ములుగు

ములుగు గట్టమ్మ వద్ద నిర్మిస్తున్న పైలాన్, నూతన కలెక్టరేట్ భవన తుది దశ పనులను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్‌తో కలిసి గట్టమ్మ వద్ద నిర్మిస్తున్న పైలాన్ పనుల పురోగతిని పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పైలాన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సుందరీకరణ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించనున్న పూజా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, సమావేశపు గది, స్టేట్ ఛాంబర్, లిఫ్ట్ సదుపాయం, జనరేటర్ సదుపాయంతో పాటు విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్, సమావేశపు గది, స్టేట్ ఛాంబర్‌లలో అవసరమైన ఏర్పాట్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని, లిఫ్ట్, జనరేటర్‌తో పాటు విద్యుత్ వ్యవస్థను ముందుగానే పరీక్షించి ఎలాంటి సాంకేతిక సమస్యలకు తావులేకుండా చూడాలని సూచించారు. భవన సముదాయం లోపల, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం, సుందరీకరణ పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, ఆర్ అండ్ బి అధికారి శ్యామ్ సింగ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎస్ఈ ఈ డి ధర్మ నాయక్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





భద్రాద్రి న్యూస్

శనివారం 15,ఆగస్టు, 2026

# దేశభక్తి చాటిన త్రివేణి విద్యార్థుల ప్రీ - ఇండిపెండెన్స్ డే వేడుకలు





**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 14 (భద్రాద్రిన్యూస్ ):**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివేణి టాలెంట్ స్కూల్స్, ఖమ్మం శాఖలో ప్రీ--ఇండిపెండెన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు భగత్ సింగ్, రాణి రుద్రమదేవి, ఇందిరాగాంధీ, నెహ్రూ, చంద్రశేఖర్ ఆజాద్ వంటి మహనీయుల వేషధారణలో ర్యాంప్ వాక్ చేసి ఆకట్టుకున్నారు. దేశభక్తి గీతాలు, నృత్యాలతో వేడుకకు మరింత శోభ తీసుకొచ్చారు. ఉపాధ్యాయులు స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర, త్యాగాలు, యువత బాధ్యతలను వివరించారు. దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. డైరెక్టర్ డా. వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను విద్యార్థులకు పరిచయం చేయడం విద్యాసంస్థల బాధ్యత అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ స్వాతంత్ర్య దినోత్సవం త్యాగాలను స్మరించుకునే పవిత్ర దినమని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సి.ఆర్.ఓ. కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో ఖమ్మం అభివృద్ధి పురోగమనం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

**స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలే స్ఫూర్తిగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలి**

**ఖమ్మం మరింత ప్రగతిని సాధించాలని పువ్వాడ ఆకాంక్ష**

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 14( భద్రాద్రిన్యూస్ ):-**

స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆకాంక్షించారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమంతో పాటు మౌలిక వసతులు, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, ఉపాధి రంగాల్లో అనేక కీలక కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఖమ్మం జిల్లా, ఖమ్మం నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత లభించడంతో గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొన్నారు. తన మంత్రిత్వ కాలంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఖమ్మం ప్రజల ప్రయోజనాలను, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, వంతెనలు, డ్రైనేజీ, తాగునీరు, ప్రభుత్వ భవనాలు, పట్టణ సుందరీకరణ, గ్రామీణ మౌలిక వసతులు తదితర రంగాల్లో అనేక అభివృద్ధి పనులను చేపట్టామని వివరించారు.

ఖమ్మం జిల్లాలో సాగునీటి విస్తరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని సీతారామ ఎత్తిపోతల పథకం, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం వంటి కీలక ప్రాజెక్టుల ద్వారా సాగునీటి సౌకర్యాన్ని విస్తరించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ, సాగునీటి వనరుల బలోపేతం, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందించే దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఖమ్మం నగరం, జిల్లా పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాదులు ఏర్పడ్డాయని మాజీ మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించడంతో పాటు వాటిని మరింత విస్తరించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి సూచించారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక సమానత్వం దిశగా ముందుకు సాగాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు అందించిన అభివృద్ధి పునాదులపై మరింత ప్రగతిని సాధించి, ఖమ్మం జిల్లా, ఖమ్మం నగరం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు.



# విప్లవ యోధుడు రాయల చంద్రశేఖర్ ఆగస్టు 16న స్మారక పుస్తకావిష్కరణ సభ

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 14 (భద్రాద్రిన్యూస్ ):-**



విప్లవ యోధుడు ఆదర్శ కమ్యూనిస్టు రాయల చంద్రశేఖర్ పుస్తకావిష్కరణ సభ ఆగస్టు 16న ఉదయం 10 గంటలు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు చంద్రశేఖర్ జీవిత సహచరి రాయల విమల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ...

విప్లవం అంటే విందు భోజనం కాదు. విప్లవ ప్రేమ అంటే విహారాలు, విరహాలు, సరదాలు కాదు. ముళ్లూ, రాళ్లూ, అవాంతరాలూ ఉంటాయని తెలిసినా, ప్రాణాన్ని కాపాడుకోవడానికి కాదు---ప్రాణాన్ని అర్పించడానికి సిద్ధపడి, నూనూగు మీసాల నవయవ్వనంలోనే అడవుల్లోకి దూకిన యువకుడు రాయల చంద్రశేఖర్.

అమ్మ అమాయకంగా పెట్టిన 'చంద్రశేఖర్' అనే పేరును, ఆజాద్ చంద్రశేఖర్ స్ఫూర్తితో తన జీవితానికే అర్థంగా మార్చుకున్న విప్లవ యోధుడు ఆయన. రాయల గోపాలకృష్ణయ్య--రాంబాయమ్మల ముద్దుల కొడుకు. అప్పయ్య, సుభాష్ చంద్రబోస్, నాగేశ్వరరావుల సోదరుడు. పోరాటాన్ని వారసత్వంగా స్వీకరించి, యాభై ఏళ్ల పాటు విప్లవోద్యమంలో అవిశ్రాంతంగా నడిచిన మనిషి.

ప్రేమించి పెళ్లాడిన జీవిత సహచరి విమలతో పాటు, కొడుకు పావెల్, కోడలు కీర్తి, మనవలు అపూర్వకృష్ణ, ఆజాద్‌కృష్ణలను కూడా తన విశ్వాసాల బాటలో నడిపించిన ఆదర్శనీయుడు. తన కుటుంబాన్నే సమాజ మార్పు ప్రయాణంలో భాగస్వాములను చేసిన విప్లవ ప్రేమికుడు. ఈ నేపథ్యంలో విప్లవ యోధుడు రాయల చంద్రశేఖర్ స్మారకంగా పుస్తకావిష్కరణ సభను ఆయన జీవిత సహచరి రాయల విమల, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 16వ తేదీన ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నారు. ఈ సభకు ప్రముఖ పత్రికా సంపాదకులు సతీష్ చందర్ గారు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ సందర్భంగా పలు విప్లవ, వామపక్ష పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని రాయల చంద్రశేఖర్ జీవితం, ఆయన సుదీర్ఘ విప్లవ ప్రస్థానం, అనుభవాలు, ఉద్యమ జీవితంలోని మానవీయ కోణాలపై ప్రసంగిస్తారు. కావున ప్రజలు, ప్రజాస్వామికవాదులు, అభ్యుదయవాదులు, మిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ పుస్తకావిష్కరణ సభను విజయవంతం చేయాలని కోరుతున్నాము.

# కియా మోటార్స్ ,యన్.వి.హెచ్ ఇండియాకు 73 మంది యస్.బి.ఐ.టి. విద్యార్థుల ఎంపిక




**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 14 (భద్రాద్రిన్యూస్ ):-**

ఎస్బిఐటి కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరంతర శిక్షణ , ప్లేస్‌మెంట్ కార్యక్రమాల ఫలితంగా తమ విద్యార్థులు ప్రముఖ వాహనరంగ పరిశ్రమలైన కియా మోటార్స్ , యన్.వి.హెచ్ ఇండియా సంస్థలలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ గా ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో ఈ.సి.ఈ., ఈ.ఈ.ఈ. విభాగాలకు చెందిన 73 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నిర్వహించిన శిక్షణ ఈ విజయానికి ప్రధాన కారణమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. కళాశాల వైస్-ఛైర్మన్ కె. శ్రీచైతన్య మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను అందించడమే తమ లక్ష్యమని, ప్రముఖ సంస్థల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో విద్యార్థులకు అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్‌కుమర్ తెలిపారు.దకియా మోటార్స్ ,యన్.వి.హెచ్ ఇండియా సంస్థలలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీలుగా ఎంపికైన విద్యార్థులకు వార్షిక ఆధాయంగా 2.50 లక్షలు అందుకుంటారని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ అభినందించారు. ఈ కార్యక్రమంలో క్వెస్‌కార్ప్ సీనియర్ హెచ్.ఆర్. యన్. రాజు, హెచ్.ఆర్. యస్.కె. నుష్రత్ జహా తో పాటు కళాశాలఅకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, టి.పి.ఒ. డా॥ యన్. సవిత, డా॥ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.